JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
జాతీయ తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజ్‌గిరి । సోమవారం 13-04-2026
Medchal - Malkajgiri । Monday 13-04-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 316
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 316 । Pages : 8 । ₹: 5




మళ్లీ టీఆర్ఎస్‌గా ఉండాలనుకుంటున్నాం.. కేటీఆర్

## బీఆర్ఎస్‌గా మారాక నష్టపోయాం



**త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటన**

**బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఆయన ఖచ్చితంగా కొట్టిపారేశారు**

జయభేరి, హైదరాబాద్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టిస్తోంది. గత ఎన్నికల ఓటమి తర్వాత పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు ఆయన సిద్ధం చేసిన కార్యాచరణను ఈ సందర్భంగా బయటపెట్టారు. బీఆర్ఎస్ పార్టీ పేరు మార్పు గురించి కేటీఆర్ అత్యంత కీలకమైన వ్యాఖ్యలు చేశారు. టీఆర్ఎస్ (TRS) పేరును బీఆర్ఎస్ (BRS) గా మార్చడం వల్ల పార్టీకి నష్టం చేకూరిందని ఆయన అంగీకరించారు. ప్రజల్లో బలంగా నాటుకుపోయిన తెలంగాణ సెంటిమెంట్ పార్టీ పేరు మారడంతో కొంత పలచబడిందని భావిస్తున్న ఆయన, పార్టీని తిరిగి 'టీఆర్ఎస్'గానే మార్చాలనే ఆలోచనలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఇది కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపే అంశంగా భావిస్తున్నామన్నారు. గత పదేళ్ల పాలనలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య దూరం పెరిగిందని కేటీఆర్ ఒప్పుకున్నారు. ఈ అంతరాన్ని తగ్గించేందుకు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు ప్రకటించారు. నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయని, అప్పుడు తాను ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేసేందుకు సిద్ధమని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోమని కేటీఆర్ తేల్చి చెప్పారు. ముఖ్యంగా బీజేపీతో పొత్తు ఉంటుందనే ప్రచారాన్ని ఆయన ఖచ్చితంగా కొట్టిపారేశారు. జైలుకు వెళ్తేనే సీఎం అవుతారనేది ఒక భ్రమ అని వ్యాఖ్యానిస్తూ, ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించారు. స్వయంశక్తితోనే మళ్లీ అధికారంలోకి వస్తామని, ప్రజాక్షేత్రంలోనే తమ బలాన్ని నిరూపించుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సైతం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు. కవిత కామెంట్స్ నేపథ్యంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి..

## ఇక యుద్ధం ఇప్పట్లో ఆగేలా లేదుగా..!



- **అమెరికా డిమాండ్లకు ఇరాన్ ప్రతినిధులు ససేమిరా అనడంతో చర్చలు అర్ధాంతరం**
- **ఈ చర్చల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింత ఉద్రిక్తం**

జయభేరి, న్యూఢిల్లీ :

పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరిగిన కీలక శాంతి చర్చలు తీవ్ర నిరాశను మిగిల్చాయి. సుమారు 21 గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ హైవోల్టేజ్ సమావేశాల్లో ఎలాంటి ఒప్పందం కుదరలేదు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాగేర్ గాలిబాఫ్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందాలు ఈ ప్రతిష్ఠాత్మక చర్చల్లో పాల్గొన్నాయి. ఇరాన్ తన అణ్వాయుధ కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేయాలన్న అమెరికా డిమాండ్లకు ఇరాన్

...మిగతాది 2 లో



## కబ్జా చేస్తే మీ ఫోన్‌కు మెస్సేజ్

- **రైతులకు ఏపీ ప్రభుత్వం అదిరే శుభవార్త..**
- **అమల్లోకి కొత్త నిర్ణయం.. ఇక పై నో టెన్షన్**

జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 12 :

రైతులకు ఉపయోగపడేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతులు భూములు కబ్జా, ఆక్రమణలు లాంటి వాటి బారిన పడకుండా చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వెబ్‌ల్యాండ్‌లో రికార్డులకు లాకింగ్ సిస్టమ్ కొత్తగా ప్రవేశపెట్టింది. ఈ లాకింగ్ సిస్టమ్ ఎలా పనిచేస్తుందంటే.. మీరు ఒకసారి వెబ్‌ల్యాండ్ రికార్డులకు లాక్ వేస్తే.. మీ అనుమతి లేకుండా ఎవ్వరూ ఏం చేయలేరు. ఆ భూమిని మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ చేయాలన్నా మీ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. 1బీ, అడంగల్ వంటి వాటిని లాక్ చేసుకోవచ్చు.

**కబ్జా చేస్తే మీ ఫోన్‌కు మెస్సేజ్**

మీ భూమిని ఎవరైనా కబ్జా చేసినా లేదా భూమిని తారుమారు చేసినా మీ ఫోన్‌కు మెస్సేజ్ వస్తుంది. అయితే కౌలు దారులకు ఈ సదుపాయం ఉండదు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో దీనిని అమల్లోకి తెచ్చారు. స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ రికార్డ్ లాకింగ్ సిస్టమ్ అనే దానిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ లాకింగ్ సిస్టమ్ ఉపయోగించుకోవాలంటే గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లాలి. అక్కడ వీఆర్వోను సంప్రదించాలి. మీ ఐరిస్, బయోమెట్రిక్, ఫేస్ రికగ్నేషన్ వంటి వివరాలతో వీఆర్వో లాకింగ్ చేస్తారు. ఆధార్‌తో వెబ్ ల్యాండ్‌లో భూమి లింక్ అయిందా.. లేదా అనేది చూస్తారు. ఆధార్, వెబ్ ల్యాండ్‌లో పేరు ఒకేలా ఉండాలి. అప్పుడు మాత్రమే మీకు లాకింగ్ ఆప్షన్ ఉంటుంది. రెండూ ఒకలా లేకపోతే మీ మొబైల్‌కు మెస్సేజ్ వస్తుంది. అయితే ఆధార్‌తో లింక్ చేస్తే 90 రోజుల తర్వాత లాకింగ్ చేసుకోవచ్చు. ఒకవేళ లాక్ తీసుకోవాలంటే భూమిని విక్రయించే సమయంలో విక్రయంచేవారు అనుమతి తీసుకోవాలి. ఇక పట్టదారుడు చనిపోతే కుటుంబసభ్యులు అన్ లాక్ చేయడానికి అంగీకారం చెప్పాల్సి ఉంటుంది.


## పరీక్షలో ఫెయిలయ్యానని సంచలన నిర్ణయం



జయభేరి, ఆదిలాబాద్ :

ఈ మధ్య కాలంలో యువత, చిన్నారులకు చిన్న చిన్న విషయాలకే ప్రాణాలు తీసుకొని తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు. ప్రేమించిన వాళ్లు నిరాకరించారని, ఫరీక్షలో ఫెయిలయ్యామని అర్ధాంతరంగా జీవితాలను చేతులారా చిదిమేసుకుంటున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే ఆదిలాబాద్ జిల్లాలో వెలుగు చూసింది. ఆదివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యాననే మనస్తాపంలో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయింది. వివరాల్లోకి వెళ్తే.. ఉట్నూర్ మండలానికి చెందిన 17 ఏళ్ల సౌజన్య స్థానికంగా ఉన్న ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. అయితే తాజాగా వెలువడిన ఇంటర్ ఫలితాల్లో సౌజన్య ఫెయిల్ అయింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన విద్యార్థిని సంచలన నిర్ణయం తీసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గదిలో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిన సౌజన్యను

...మిగతాది 2 లో



రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా అధిక లాభాలు అందించే ఆయిల్ ఫామ్ సాగుపై దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ పంట ద్వారా రైతులు స్థిరమైన ఆదాయం పొందవచ్చని, ఈ విషయంలో తాను గ్యారెంటీ ఇస్తానని స్పష్టం చేశారు. గ్రామ గ్రామానా పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ సాగును విస్తరించాలని ఆయన సూచించారు.

## ఆయిల్ ఫామ్ సాగు చేస్తే డబ్బే డబ్బు

- **24 మంది రైతులకు రూ.40.80 లక్షల విలువైన పరికరాలు**
- **చిన్న గ్రామాల్లో కనీసం 50 ఎకరాలు, పెద్ద గ్రామాల్లో 100 ఎకరాల మేర ఆయిల్ ఫామ్ సాగు చేయాలి.. మంత్రి పొన్నం ప్రభాకర్**

జయభేరి, హుస్నాబాద్ :

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో మంత్రి రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ఆధునాతన పనిముట్లను పంపిణీ చేశారు. 24 మంది రైతులకు రూ.40.80 లక్షల విలువైన పరికరాలు అందజేశారు. ఇందులో రోటావేటర్లు, బేలర్లు, పవర్ స్ప్రేయర్లు వంటి యంత్రాలు ఉన్నాయి. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. చిన్న గ్రామాల్లో కనీసం 50 ఎకరాలు, పెద్ద గ్రామాల్లో 100 ఎకరాల మేర ఆయిల్ ఫామ్ సాగు చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున ఆయిల్ ఫామ్ సాగు చేపడితే రైతులకు మంచి లాభాలు వస్తాయని, మధ్యలో అంతర పంటలు వేసుకోవడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చని మంత్రి తెలిపారు. ఈ పంటను ఎక్కువగా సాగు చేసే గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల నంగునూరు మండలం నర్మెట్టలో ప్రారంభించిన ఆయిల్ ఫ్యాక్టరీ రైతులకు మార్కెట్ సౌకర్యాన్ని అందిస్తుందని చెప్పారు. అశ్వరావుపేట ప్రాంతం ఈ సాగులో ఆదర్శంగా నిలుస్తోందని గుర్తుచేశారు. వ్యవసాయ పనిముట్లు అవసరమున్న

...మిగతాది 2 లో



## మాడు పగిలే మండుటెండలు

- **తెలుగు రాష్ట్రాలకు తీవ్ర వడగాల్పుల హెచ్చరిక..**

జయభేరి, హైదరాబాద్ :

ఎండలు, వడగాల్పులపై ఏపీకి వాతావరణశాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎండ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశముందని, అప్రమత్తంగా ఉండాలని వార్నింగ్ ఇచ్చింది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 51 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఇక మంగవారం ఏకంగా 53 మండలాల్లో తీవ్ర స్థాయిలో వడగాలులు వీస్తాయని, ఈ క్రమంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఇక రాయలసీమ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని స్పష్టం చేసింది. వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బయటకు రాకపోవడం మంచిదని

...మిగతాది 2 లో



మొదటిపేజీ తరువాయి

## ఇక యుద్ధం ఇప్పట్లో ఆగేలా లేదుగా..!

ప్రతినిధులు ససేమిరా అనడంతో చర్చలు అర్థాంతరంగా విఫలమయ్యాయి. తాము తుది, అత్యుత్తమ ఆఫర్ ఇచ్చామని, ఇరాన్ దాన్ని అంగీకరించలేదని వాన్స్ తెలిపారు. ఈ పరిణామంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన సమయంలో ఇరాన్ పని పడతామని, ఆ దేశాన్ని పూర్తిగా అంతం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. ఈ చర్చల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. చర్చలు విఫలమైన వెంటనే ట్రంప్ సోషల్ మీడియా వేదికగా సంచలన ప్రకటన చేశారు. అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకమైన హోర్ముజ్ జలసంధిలో అమెరికా నౌకాదళం దిగ్బంధనం ప్రారంభిస్తుందని ఆయన వెల్లడించారు. ఈ మార్గం గుండా ప్రయాణించే, బయటకు వచ్చే ప్రతి నౌకను అడ్డుకోవాలని నేవీని ఆదేశించారు. ఇరాన్‌కు అక్రమంగా టోల్ చెల్లించిన నౌకలను అంతర్జాతీయ జలాల్లో ఎక్కడికక్కడ నిలిపివేస్తామన్నారు. అమెరికా నౌకలపై ఇరాన్ దళాలు కాల్పులు జరిపితే వారిని నరకానికి పంపుతామని ట్రంప్ తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. అమెరికా డిమాండ్లను ఇరాన్ తీవ్రంగా తప్పుబట్టింది. అణ్వాయుధాలపై అమెరికా అహేతుకమైన, చట్టవిరుద్ధమైన షరతులు పెట్టిందని ఇరాన్ విదేశాంగ శాఖ విమర్శించింది. యుద్ధం ద్వారా సాధించలేని వాటిని సుదీర్ఘ చర్చల ద్వారా పొందాలని అమెరికా చూస్తోందని, దానికి తాము స్పష్టంగా 'నో' చెప్పామని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు హోర్ముజ్ జలసంధిని దిగ్బంధిస్తే ప్రపంచవ్యాప్తంగా చమురు, ఆహార భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని యూఏఈ ఇంధన సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ శాంతి చర్చలకు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, అక్కడి సైనిక ఉన్నతాధికారులు మధ్యవర్తిత్వం వహించారు. ఇరు పక్షాలు అంగీకరిస్తే భవిష్యత్తులోనూ చర్చలకు సహకరిస్తామని పాకిస్థాన్ ప్రకటించింది. ప్రస్తుతం అమెరికా, ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇరాన్‌లో భారీ ప్రాణనష్టం సంభవించింది. ఇప్పటివరకు 3,375 మృతదేహాలను గుర్తించగా, వారిలో వందలాది మంది చిన్నారులు ఉన్నారు. చర్చల వైఫల్యంతో ఈ భయంకర యుద్ధం మరింత వినాశనానికి దారి తీస్తుందని అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఆందోళన చెందుతోంది.

## డబ్బే డబ్బు

రైతులు వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రతిపాదనలు వచ్చిన వెంటనే అదనపు పరికరాలు మంజూరు చేయిస్తామని మంత్రి తెలిపారు. చాలా సంవత్సరాల తర్వాత ప్రజా ప్రభుత్వంలో ఇలాంటి పనిముట్ల పంపిణీ జరుగుతోందని పేర్కొన్నారు. ముఖ్యంగా గడ్డి మోపులు కట్టే బేలర్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని, వాటిని అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఇక సాగునీటి విషయంలో కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి వివరించారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణం త్వరలో పూర్తి చేస్తామని, రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన భూములను ఇవ్వాలని కోరుతూ, పెండింగ్ పేమెంట్లను త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్ లైన్ రోడ్ నిర్మాణానికి కూడా స్థానికుల సహకారం అవసరమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి చిగురుమామిడి మండలంలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఆధునాతన సౌకర్యాలతో పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, ఒకే ప్రాంగణంలో ప్రైమరీ, హైస్కూల్, జూనియర్ కాలేజీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.

## పరీక్షలో ఫెయిలయ్యానని..

చూసి షాక్ అయ్యారు. వెంటనే బాలికను కిందకు దింపి ఆమెను స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ సౌజన్యను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అది విన్న తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మాడు పగిలే మండుటెండలు

వాతావరణశాఖ సూచనలు చేసింది.

**వచ్చే రెండు రోజులు జాగ్రత్త**

రానున్న రెండ్రోజుల పాటు రాష్ట్రంలో తీవ్ర వడగాలులు వీస్తాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. సోమవారం 51 మండలాల్లో తీవ్ర వడగాలులు ఉంటాయని, ఇక మంగళవారం 53 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 57 మండలాల్లో వడగాలులు వీస్తాయని తెలిపారు. రానున్న రెండు రోజుల వాతావరణం చూస్తే.. కోస్తా, రాయలసీమ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు, ఉత్తరాంధ్ర జిల్లాల్లో వడగాలులు ప్రభావం ఉంటుందని స్పష్టం చేశారు. ఇక ఆదివారం రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో గరిష్ఠ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కడప జిల్లా పొట్టిపాడులో 43.8 డిగ్రీల సెల్సియస్ అత్యధిక ఉష్ణోగ్రత నమోదవ్వగా.. తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1 డిగ్రీ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక నంద్యాల రూరల్ మండలంలో 42.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. అయితే ఏప్రిల్‌లోనే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరుకోగా.. మే నెలలో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది.

**22 వరకు మండుటెండలు**

ఇక తెలంగాణలో ఈ నెల 22వ తేదీ వరకు భానుడి ప్రతాపం తీవ్ర స్థాయిలో ఉంటుందని హైదరాబాద్ వాతావరణశాఖ తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 45 డిగ్రీల వరకు నమోదవుతాయని స్పష్టం చేసింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించింది. బయటకు వెళితే తలకు గ్యాప్, గొడుగు లాంటివి వాడాలని తెలిపింది. ఇక వాటర్, జ్యూస్‌లు లాంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించింది. ఇక హైదరాబాద్‌లో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎండ ప్రభావం క్రమంలో మధ్యాహ్నా వేళల్లో రోడ్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

## మహనీయుల ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

- మెట్టు శ్రీధర్

జయభేరి, పటాన్ చెరు :

మహనీయుల ఆశయాలను అందరు స్ఫూర్తి గా తీసుకుని పని చేయాలని తెలంగాణ యువజన సంఘాల సమితి ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ అన్నారు. శనివారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పటాన్‌చెరు లో ర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెట్టు శ్రీధర్ పాల్గొన్నారు. పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ఆయన పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మెట్టు శ్రీధర్ మాట్లాడుతూ, సామాజిక సమానత్వం విద్య ద్వారానే అణగారిన వర్గాల అభివృద్ధి సాధ్యమని నమ్మిన గొప్ప వ్యక్తి జ్యోతిరావు పూలే అని కొనియాడారు. నేటి యువత మహనీయుల జీవిత చరిత్రలను చదివి, వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యేపురి శివానందం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రుద్రారం శంకర్ పాల్గొనగా.. వారితో పాటు బలవంత, శ్రీరాములు, అడ్వకేట్ విజయ్, సత్యనారాయణ, రవీంద్ర చారి, కిష్టయ్య, కార్ రాజు, కళ్యాణ్, అఫ్జల్ మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నారసింహుడి ప్రసాదానికి ఎసరు

జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 12 :

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి పేరుతో జరుగుతున్న అక్రమాలు ఇప్పుడు పెద్ద దుమారం రేపుతున్నాయి. స్వామి వారి ప్రసాదంలో ఉపయోగించే జీడిపప్పు, బాదం, నెయ్యి వంటి విలువైన సరుకులు స్వామివారికి నైవేద్యంలో వాడకుండా మధ్యలోనే మాయం అవుతున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. భక్తులు సమర్పించిన కానుకలతో ప్రసాదం తయారు చేయాల్సింది పోయి,కొంతమంది సిబ్బంది వాటిని వ్యక్తిగతంగా వినియోగిస్తున్నారన్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ప్రసాదం తయారీ కేంద్రంలో నిల్వల లెక్క,రికార్డులకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో పెద్ద ఎత్తున స్కామ్ జరుగుతోందనే అనుమానాలు రోజురోజుకు బలపడుతున్నాయి. అవుట్ సోర్సింగ్ సిబ్బంది చేతివాటానికి కొంతమంది అధికారులు తోడవడంతో, స్వామివారి ప్రసాదం తయారీ దొడ్డిదారిలో ఇళ్లకు చేరుతున్నట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు కొత్తవి కాదు.. గతంలో ప్రసాదాల తయారీలో వాడే చింతపండు బస్తాలు మాయం కావడం కలకలం రేపగా, ఇప్పుడు లడ్డూలకు వాడే బాదం, కాజు వంటి ఖరీదైన సరుకులు కూడా అదృశ్యమవుతున్నాయి.

నెయ్యితో లడ్డులు చెయ్యాల్సింది... నీటిలో లడ్డులు కొట్టడంతో వారం రోజులులో నిల్వ ఉండవలసిన లడ్డు 2 రోజుల్లో బుజు పట్టిన సందర్భంలు కోకొల్లలు.... లడ్డు నాణ్యత దెబ్బతిన్నది. పరిమాణం తగ్గింది.. కాజు, కిస్మిస్, కలకండ, కంటికి కనబడటం తగ్గింది... తాజాగా ప్రసాదాల తయారీ కేంద్రంలో ప్రసాదంలో వాడే వస్తువులు దొంగిలిస్తూ సిబ్బంది మీడియాకు పట్టుబడటం మరింత సంచలనంగా మారింది. అంతేకాదు,సరుకులతో పకోడీలు తయారు చేసుకుని అక్కడికక్కడే తినడం భక్తులను ఆగ్రహానికి గురిచేస్తోంది. మిగిలిన సరుకులను ప్యాకెట్లలో నింపి బయటకు తీసుకెళ్లే సమయంలో అడ్డంగా పట్టుబడ్డారు. యాదగిరిగుట్ట దేవస్థానం గోదాములకు ప్రస్తుతం అక్రమాలకు నిలయాలుగా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసాదాల తయారీ కోసం కొనుగోలు చేసే బియ్యం, నూనె, జీడిపప్పు, బాదం వంటి సరుకులు గోదాములకు చేరినప్పటికీ అవి ప్రసాదంలో కలువకుండా మాయమవుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగితాల్లో ఉన్న లెక్కలు, వాస్తవ నిల్వల మధ్య భారీ తేడాలు కనిపిస్తున్నాయని, స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా తనిఖీ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం ఈ అక్రమాలకు మరింత దారితీస్తోంది.

ఈ వ్యవహారంలో అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాత్ర ఉన్నప్పటికీ,ఉన్నతాధికారుల అండ లేకుండా ఇంత స్థాయిలో అక్రమాలు జరగడం అసాధ్యమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గోదాముల వద్ద సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ,వాటి ఫుటేజీని సమీక్షించే వ్యవస్థ లేకపోవడం,గతంలో జరిగిన ఘటనలపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల భయం తగ్గిపోయిందని భక్తులు, స్థానికులు వాపోతున్నారు.


“ నెయ్యితో లడ్డులు చెయ్యాల్సింది... నీటిలో లడ్డులు కొట్టడంతో వారం రోజులులో నిల్వ ఉండవలసిన లడ్డు 2 రోజుల్లో బుజు పట్టిన సందర్భంలు కోకొల్లలు.... లడ్డు నాణ్యత దెబ్బతిన్నది. పరిమాణం తగ్గింది.. కాజు, కిస్మిస్, కలకండ, కంటికి కనబడటం తగ్గింది... తాజాగా ప్రసాదాల తయారీ కేంద్రంలో ప్రసాదంలో వాడే వస్తువులు దొంగిలిస్తూ సిబ్బంది మీడియాకు పట్టుబడటం మరింత సంచలనంగా మారింది. అంతేకాదు,సరుకులతో పకోడీలు తయారు చేసుకుని అక్కడికక్కడే తినడం భక్తులను ఆగ్రహానికి గురిచేస్తోంది. మిగిలిన సరుకులను ప్యాకెట్లలో నింపి బయటకు తీసుకెళ్లే సమయంలో అడ్డంగా పట్టుబడ్డారు. యాదగిరిగుట్ట దేవస్థానం గోదాములకు ప్రస్తుతం అక్రమాలకు నిలయాలుగా మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రసాదాల తయారీ కోసం కొనుగోలు చేసే బియ్యం, నూనె, జీడిపప్పు, బాదం వంటి సరుకులు గోదాములకు చేరినప్పటికీ అవి ప్రసాదంలో కలువకుండా మాయమవుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగితాల్లో ఉన్న లెక్కలు, వాస్తవ నిల్వల మధ్య భారీ తేడాలు కనిపిస్తున్నాయని, స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా తనిఖీ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం ఈ అక్రమాలకు మరింత దారితీస్తోంది.





స్వామి వారికి మహానైవేద్యంగా సమర్పించాల్సిన సరుకులను దొంగిలించడం కేవలం అపచారం మాత్రమే కాదు.. తీవ్రమైన నేరమని భక్తులు మండిపడుతున్నారు. వేల కోట్లతో అభివృద్ధి చేసిన ఈ పవిత్ర క్షేత్రంలో ఇలాంటి ఘటనలు ఆలయ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం,యాదగిరిగుట్ట దేవస్థానం ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గోదాముల్లో సమగ్ర తనిఖీలు చేపట్టాలని,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రసాదం తయారీ విభాగంలో పారదర్శకత కోసం డిజిటల్ స్టార్ మేనేజ్మెంట్ వ్యవస్థను అమలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచిస్తున్నారు.

# యాదాద్రిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



- శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్యరాబడి రూ.40.34లక్షలు

జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 12 :

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం సెలవు రోజు కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామి వారి దర్శన క్యూలైన్లు, ప్రసాద విక్రయ కేంద్రాలు, గదుల విచారణ కార్యాలయం,టికెట్ల విక్రయ కేంద్రాలు, పార్కింగ్, బస్టాండ్, పుష్కరిణి, తలనీలాలు సమర్పించే కేంద్రం, శ్రీసత్యనారాయణ వ్రత మండపంతో పాటు పరిసర ప్రాంతాల్లో భక్తులు సందడి చేశారు. అశేషంగా తరలివచ్చిన భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ఉచిత దర్శనానికి 4 గంటలకు,సర్వ దర్శనానికి 2 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**కొనసాగుతున్న నిత్యపూజలు..**

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. ఆలయంలో జరిగిన శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలతో పాటు పలు సేవల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేతరామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**యాదగిరీశుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారికి ఆదివారం వివిధ శాఖల నుంచి భారీగా ఆదాయం వచ్చింది. నిత్యరాబడిలో భాగంగా స్వామి,అమ్మవార్లకు రూ.40,34,619 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.2,71,700, బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,82,200, శ్రీసత్యనారాయణ వ్రతాల ద్వారా రూ.2,29,000, రూ.150 వీఐపీ దర్శనం ద్వారా రూ.5,21,700, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.6,27,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.88,116, ప్రసాద విక్రయం ద్వారా రూ.13,30,600, కల్యాణకట్ట ద్వారా రూ.1,35,000తోపాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడి సేవలో ఐఏఎస్ శేషాద్రి దంపతులు**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి సీఎం టూ ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భవానీ శంకర్ స్వామి వారి లడ్డు ప్రసాదం,జ్ఞాపికను అందజేశారు.

# ఉల్లాసంగా.. ఉత్సాహంగా.. గజ్వేల్ ప్రోమో రన్

- గజ్వేల్ ప్రోమో రన్ లో పాల్గొన్న రన్నర్స్
- ఆటపాటలతో హోరెత్తిన ఐఓసీ మైదానం
- ప్రతి ఒక్కరు వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలి
- డ్రగ్స్ గంజాయికి దూరంగా ఉండాలి




**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 12:**

గజ్వేల్ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రోమో రన్ ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. ఆదివారం ఉదయం పట్టణంలోని ఐఓసీ మైదానం పచ్చటి రంగును సంతరించుకుంది. మెడ్‌వన్ హాస్పిటల్స్‌తెలంగాణ రన్నర్స్ సహకారంతో నిర్వహించిన ఈ రన్ లో పెద్ద ఎత్తున రన్నర్స్ పాల్గొన్నారు. మొదట 10కే రన్ ను గజ్వేల్ ఏసీపీ కోణం నర్సింలు, ఇన్స్ పెక్టర్లు వి. రవికుమార్, ఎస్కే లతీఫ్ లు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం 5కే రన్ ను ఏసీపీ, ఇన్స్పెక్టర్లతో పాటు మాజీ సర్పంచ్ ఎల్కంటి సంతోషవెంకటేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున రన్నర్స్, వాకర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మై విలేజ్ షో బృందం మాటలు, మోహన్ జుంబా డాన్స్, దివ్య హోస్టింగ్ అందరిని అలరించాయి. ఈ పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మెడల్స్ అందజేశారు. 10కె రన్ మేల్ మొదటి విజేతగా కుల్దీప్ సింగ్ నిలువగా, ఫీమేల్ లో నవీనారెడ్డి, 5కె రన్ లో మేల్ లో 5కె రన్ ఫీమేల్ లో శ్రీక్షేత్ర నిలిచారు. వారికి స్పాన్సర్స్ బహుమతులు అందజేశారు. అనంతరం ఏసీపీ నర్సింలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని, డ్రగ్స్ గంజాయికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు గంజాయి, డ్రగ్స్ కి దూరంగా ఉంటూ ఆరోగ్యకర జీవితం వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. మెడ్ వన్ హాస్పిటల్స్ ప్రతినిధి సంగీతా మాట్లాడుతూ.. వ్యాయామంలో అనేక వ్యాధులు దూరం అవుతాయని, ప్రతి రోజు వ్యాయామం అలవాటు చూసుకోవాలన్నారు. హంస హోమియోపతి మెడికల్ కళాశాల యజమాని ఎక్కలదేవీ ఉమేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు హెల్తీ లైఫ్ స్టైల్ ను అలవాటు చేసుకోవాలని, భవిష్యత్తుకు మంచి అలవాట్లను ఎంచుకునేలా గజ్వేల్ రన్నర్స్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని అన్నారు. వారితో డీసీసీ అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షా రెడ్డి, స్పాన్సర్స్ రాజుగౌడ్, గీతాంజలి రాజిరెడ్డి, వేణు గోపాల్ రెడ్డి, గోలి సంతోష్, రాజు, శేఖర్, ఐఎంఏ ప్రతినిధి నరేష్ బాబు, ఆంజనేయులు, సబ్బని శ్రీనివాస్, యాదగిరి, తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డి, ప్రతినిధులు రవి, రాజు, బాపిరెడ్డి, స్వాతి, గజ్వేల్ రన్నర్స్ వెంకటేష్, జంగం రమేష్ గౌడ్, ఆంజనేయులు, మధుసూదన్ రెడ్డి, నిఖిల్ రెడ్డి, లింగారెడ్డి, సత్యం, గోవర్ధన్ రెడ్డి, తాళ్ల నరేష్, కనకయ్య, వెంకటేశ్వర్లు, కరుణాకర్, ప్రమీద్, గణేష్, శ్రీశైలం, జయపాల్, కన్నా, కోటె స్వామి, నానిగౌడ్, ముస్తఫా, బాలు, గుజ్జ ప్రవీణ్, అష్రఫ్, ఎన్సీసీ క్యాడెట్లు తదితరులు ఉన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 12 :**

ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ఆదివారం యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రంను ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల తాగునీటి కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడంపై ఆయన అభినందించారు. ప్రజలకు సేవ చేయడం తమ ముఖ్య లక్ష్యమని, ఇలాంటి కార్యక్రమాలు ఆలేరు నియోజకవర్గం వ్యాప్తంగా కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్‌గౌడ్, వైస్ చైర్మన్ బరిగె రమ్య, కౌన్సిలర్ బూడిద మధు, ముఖ్యర్ల మల్లేష్ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్ రెడ్డి, మైలార్‌గూడెం ఉప సర్పంచ్ బండి అశోక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ గుండు నరసింహ గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి, కాంగ్రెస్ నేతలు కౌకుట్ల బాల్ రెడ్డి, కొడదల అంజయ్య, పెల్లిమెలి శ్రీధర్ గౌడ్, గుడ్ల నరేష్, ఎరుకుల హేమందర్, ములుగు నరసింహ, సలాం, కృష్ణ, సురేష్, లింగం, నమిల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.




## ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటిన రెడ్ సన్ జూనియర్ కళాశాల లియోన

**జయభేరి, మేడ్చల్ :**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మేడ్చల్ పట్టణంలోని రెడ్ సన్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి సత్తా చాటారు.ద్వితీయ సంవత్సరం బైపిసి గ్రూపులో లియోన 1000మార్కులకు గాను 992మార్కులు,ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల యాజమాన్య సభ్యులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడ్చల్ పట్టణంలో ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలను సాధిస్తూ రెడ్ సన్ జూనియర్ కళాశాల ప్రతి సంవత్సరం ముందంజలో ఉంటుందని కళాశాల యాజమాన్య సభ్యులు తెలిపారు.కళాశాల అధ్యాపకులకు, తల్లిదండ్రుకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- దైవ చింతనతో మానసిక ప్రశాంత



**జయభేరి, చింతపల్లి :**

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం చింతపల్లి చింతపల్లి శ్రీ సాయి సన్నిధిలో 108 గరుకు స్తంభాల స్థాపన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాయిబాబా అనుగ్రహం పొందాలి అని ఆయన అన్నారు.దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆయన అన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తండ్రి బాటలో (తనయ) కూతురు

- తన మొదటి వేతనాన్ని ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు అందజేత
- 25 సంవత్సరాలుగా రైతు ఆత్మహత్యల పై పని చేస్తున్న పులి రాజు
- శభాష్ మనస్వి



**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 12:**

తండ్రి చేసే సామాజిక కార్యక్రమంలో తాను కూడా భాగస్వామి అవుతూ అందరితో శభాష్ అనిపించుకుంటుంది. ఇంజనీరింగ్ పూర్తి చేసి సాఫ్ట్వేర్ రంగంలో ఉద్యోగం సాధించిన యువతి తన మొదటి నెల వేతనాన్ని ఆత్మహత్య చేసుకున్న 5 రైతు కుటుంబాలకు అందించి అందరి మన్ననలు పొందుతుంది మనస్వి.

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో గల ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామానికి చెందిన పులి రాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు గత 26 సంవత్సరాలుగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలపై అధ్యయనం చేస్తూ ఆ కుటుంబాలకు దాతల సహకారంతో ఆర్థిక సహాయంతో పాటు పిల్లలకు విద్య అందించడానికి కృషి చేస్తున్నాడు.

తండ్రి సామాజిక సేవను గమనిస్తూ వచ్చిన పులిరాజు కూతురు పులి మనస్వి ఇటీవల ఇంజనీరింగ్ పూర్తి చేసి యాక్సెంచర్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం సాధించారు. ఈ నెల 10వ తేదీన మొదటి వేతనం పొందిన మనస్వి తనకు వచ్చిన డబ్బులు మొత్తం ఆత్మహత్య చేసుకున్న ఐదు రైతు కుటుంబాలకు అందజేశారు ఒక్కొక్కరికి ఐదువేల నగదు తో పాటు ఒక చీరను అందించారు. కుటుంబాల పేర్లు 1. కుమ్మరి స్వామి భార్య రేణుక ఎల్కల్ గ్రామం, 2. చింతకింది అనూష గ్రామం వేలూరు మండలం వర్గల్, 3. కొండి మానస గ్రామం ఏటిగడ్డ కిష్టాపూర్ RR కాలనీ, 4. తొర్రి రేణుక ఎల్కల్ గ్రామం, 5. గుడిసె కల్యాణి జాలిగామ గ్రామం. చిన్నతనంలోనే రైతు ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి పెద్ద మనసు చూపించిన మనస్వి ని పలువురు అభినందించారు.

# ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

- అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా యువత నడుచుకోవాలి - ఎమ్మెల్యే మల్లారెడ్డి



**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 12:**

అందరికి సమాన హక్కులు సామాజిక బాధ్యత అని చాటిచెప్పిన మహనీయుడు అంబేద్కర్ అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. ముడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆనంతారం గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీగా జనసందోహం కనిపించింది. స్థానిక ప్రజలు, యువకులు, మహిళలు, వివిధ రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివి అని , ఆయన రచించిన రాజ్యాంగం దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించిందని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా విస్తరణ కోసం అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధి కోసం అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడం ప్రతి నాయకుడి బాధ్యత అని, యువత ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జాం రవి, వంగ వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ నాయకులు, పార్టీ శ్రేణులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండ వెంకటేశ్వర స్వామి తిరుచ్చి సేవ

- అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారు



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా లోని ప్రధాన దేవాలయమైన మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవా పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి శనివారం రాత్రి స్వామి వారి తిరుచ్చి సేవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ కార్యక్రమాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి నుండి శోభాయ మానంగా అలంకరించిన తిరుచ్చి వాహనంపై స్వామి వారిని దేవస్థానం ముందున్న రథమండపం వరకు ఊరేగింపుగా తీసుకోవచ్చారు. పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురుల మధ్య స్వామి వారి ఊరేగింపు ముందుకు కదిలింది. ఈ సందర్భంగా మండపంలో స్వామివారికి దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్ కుమార్ ఆధ్వర్యంలో పలు పూజా కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. అనంతరం స్వామివారిని మళ్లీ పల్లకిలో గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అళహరి రామకృష్ణ, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, ఈఓ శ్రీనివాసరాజు, పర్యవేక్షకుడు నిత్యానంద చారిలతోపాటు దేవస్థానం సిబ్బంది, పురోహితులు, వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత సన్మార్గంలో నడవాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి



**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 12 :**

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి సన్మార్గంలో నడవాలని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు గొంగిడి దంపతులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశభక్తి,ధైర్య సాహసాలకు నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు. శివాజీ విగ్రహం ఏర్పాటు చేయడం యువతకు నిత్యం స్ఫూర్తిదాయకమని,శివాజీ మహారాజ్ అడుగుజాడల్లో యువత నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంగపల్లి గ్రామ ఉప సర్పంచ్ చిన్నం మల్లయ్య,వార్డు సభ్యులు,గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం



**జయభేరి, యాదగిరిగుట్ట, ఏప్రిల్ 12 :**

యాదగిరిగుట్ట మున్సిపల్ పరిధిలోని గుండ్లపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.గుండ్లపల్లి గ్రామానికి చెందిన కంబాల జహంగీర్, పాండు,కృష్ణ యాదవ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నీలిమ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి వాణీ భరత్‌గౌడ్ ప్రారంభించగా మున్సిపల్ కౌన్సిలర్లు పేరబోయిన సత్యనారాయణ యాదవ్,ముక్కెర్ల మల్లేష్ యాదవ్,బబ్బూరి శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరంలో పలువురికి రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, నేతలు ముక్కెర్ల అండాలు, పేరబోయిన మహేందర్, కంబాల సాయి తేజ్,పబ్బాల నరసింహ,కంబాల సాయి కుమార్, బండి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్ట

- సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి



**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 12 :**

వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం శ్రీ హనుమాన్ స్వామి,నవగ్రహ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి యాదగిరి మాట్లాడుతూ గ్రామంలోని పురాతన హనుమాన్ ఆలయం పునర్నిర్మాణం, స్వామివారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, గత నాలుగు రోజులుగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు కన్నుల పండుగగా గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని, స్వామివారి కృప అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలక వర్గం సభ్యులు,పురోహితులు రవీంద్ర శర్మ,గురుస్వామి అంజా గౌడ్,దాతలు,గ్రామస్థులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## బట్రాజ్ సంఘం జిల్లా అధ్యక్షునిగా దేవరాజు సంపత్ రాజు ఎన్నిక

**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 12 :**

యాదాద్రి భువనగిరి జిల్లా బట్రాజు సంఘం జిల్లా అధ్యక్షునిగా రెండవసారి తుర్కపల్లి మండలం కొండాపురం గ్రామానికి చెందిన దేవరాజు సంపత్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఆదివారం భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర పరిశీలకులు దేవరాజు సత్యకర్ రాజు భాస్కరుని జగన్నాథ రాజుల ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా భాస్కరుని ఉదయ్‌రాజు జిల్లా మహిళ అధ్యక్షురాలుగా బిరుదు రాజు శైలజ, ప్రధాన కార్యదర్శిగా ప్రతి కంఠం పావని కోటేశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బట్రాజుల సంఘ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా వారిని సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

## సార్ కార్యక్రమం పై అవగాహన సమావేశం



**జయభేరి, తుర్కపల్లి, ఏప్రిల్ 12 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో బిజెపి మండల శాఖ ఆధ్వర్యంలో సార్ కార్యక్రమం పై అవగాహన సమావేశాన్ని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి ,సంక్షేమ పథకాల వల్ల దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని అన్నారు. ఈ పథకమును ప్రజలందరికీ చేరవేయడం ప్రతి కార్యకర్త బాధ్యత అని తెలిపారు. ఈనెల 14వ తేదీన జరగబోయే భారత రాజ్యాంగ నిర్మాత మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించాలని అన్నారు .అంబేద్కర్ ఆశయాలు, సమానత్వము, సామాజిక న్యాయము విద్య సమాజానికి మార్గదర్శకాలని వాటిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా, మండల సీనియర్ నాయకులు జక్కుల వెంకటేశం, పాముల రామచంద్రం, గొర్ల రామచంద్రం, జిల్లా మోర్చా కార్యదర్శి మేకల పాండు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి బినారం కనకయ్య, యూత్ అధ్యక్షుడు ప్రభాకర్, ఏసబోయిన నాగరాజు, బిక్షపతి పాల్గొన్నారు.

## చిన్నారి భావన వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

- ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం అభినందనీయం సర్పంచి పసునూరి యుగేందర్ రెడ్డి




**జయభేరి, కొండమల్లేపల్లి :**

ఆపదలో ఉన్నవారికి కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో అధిక సహాయాన్ని అందించి చేయూతనివ్వడం అభినందనీయమని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి అన్నారు. దేవరకొండ పట్టణం ఆరో వార్డుకు చెందిన దువ్వ ప్రవీణ్ కుమార్ నాలుగు సంవత్సరాల కుమార్తె ఇటీవల అనారోగ్యానికి గురైంది. దీంతో కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులను ఆర్థిక సహాయాన్ని కోరారు. ఆదివారం భావన వైద్య ఖర్చుల నిమిత్తం కేఎంపి హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సేకరించిన 15వేల రూపాయలను సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. నిరుపేద కుటుంబం కావడంతో మీలోఫర్లో వైద్యం చేయించుకోవడం, హెల్పింగ్ హాండ్స్ వారికి ఆర్థిక సహాయం అందించడం హర్షనీయమన్నారు. చిన్నారి భావన త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి,కేఎంపి హెల్పింగ్ హాండ్స్ నిర్వాహకులు భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా దువ్వ ప్రవీణ్ సంస్థ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరుకొండ రాము, కూన భానుచందర్, పిల్లి మల్లేష్(సి ఎ), బొడ్డుపల్లి మల్లికార్జున్, పొగాకు మల్లేష్ యాదవ్, గిరి వెంకటయ్య, అందుగుల పరమేష్, సదానందం, కుంభం గిరి, ఎండి లతీఫ్, ఆడెపు సతీష్,గోవర్ధన్, సుబ్బు, భూతరాజు అంజన్ కుమార్, గుండెబోయిన రవి, కేసాని రాజు, శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మొదటి క్యాబినెట్ సమావేశం



**జయభేరి, దేవరకొండ :**

తెలివి ఉండి కూడా వాడకుంటే తెలివి లేనివాడితో సమానమే అలాగే డబ్బు ఉండి కూడా వాడకుంటే పేదవాడితో సమానమే అన్ని ఉండి కూడా అనుభవించకుంటే పిసినారి తో సమానం ఏది చేయకుండా ఉంటే సోమరితో సమానం అనుభవించు ఆచరించు ప్రేమించు జీవితం చిన్నది ఉన్న అన్ని రోజులు తృప్తిగా ఉండు అది నీకు పది వేలు వాసవి క్లబ్ దేవరకొండ శ్రీ వాసవి కన్యాక పరమేశ్వరి టెంపుల్ లో సోలార్ ఫిటింగ్ చేసిన శివసాయి సోలార్ ఎనర్జీస్ వారిని అభినందించిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మొదటి క్యాబినెట్ సమావేశం.

# బాల బాలికలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

- ఘనంగా 162వ జ్ఞానమాల ఉత్సవం
- సామాజిక, ఆర్థిక, విద్యా, రాజకీయ సాధికారత కోసం అందరూ కృషి చేయాలని పిలుపు
- డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తరఫున, రిసోర్స్ సెంటర్‌లో కంప్యూటర్ & టైపింగ్ శిక్షణ తరగతులు ప్రారంబం
- బాలురు, బాలికలకు పోటీ పరీక్షల కోసం కోచింగ్ తరగతులు ప్రతి ఆదివారం నిర్వహించి, అంబేద్కర్ వారసత్వాన్ని కాపాడాలని సంకల్పం
- ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞానప్రకాశ్ ఐఆర్ఎస్, రిటైర్డ్ అదనపు ఆదాయపు పన్ను కమిషనర్



**జయభేరి, హైదరాబాద్ :**

డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అనంతరాజ్ టి. మధుకర్ (సీనియర్ అంబేద్కరైట్ నాయకులు) వారి మార్గదర్శకత్వంలో, లోత్‌కుంట లోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద 162వ వారపు జ్ఞానమాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు ప్రేరణాత్మక ప్రసంగాలు చేస్తూ, డా. బి.ఆర్. అంబేద్కర్ వారసత్వం, సామాజిక న్యాయం పట్ల వారి అంకితభావాన్ని ప్రస్తావించారు. అలాగే, అంబేద్కర్ జీవితం, లక్ష్యం గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించి, సామాజిక, ఆర్థిక, విద్యా మరియు రాజకీయ సాధికారత కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 162వ వారపు జ్ఞానమాల ర్యాలీ అనంతరం, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి నూతన కార్యాలయ ప్రారంభోత్సవం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞానప్రకాశ్ (ఐఆర్ఎస్, రిటైర్డ్ అదనపు ఆదాయపు పన్ను కమిషనర్, ఆది హిందూ సోషల్ సర్వీసెస్ లీగ్ మేనేజింగ్ ట్రస్టీ) మాట్లాడుతూ, భారత దళిత ఉద్యమ పితామహుడు భాగ్యరెడ్డి వర్మ డా. బి.ఆర్. అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడటంలో, విద్య ద్వారా సమానత్వాన్ని సాధించడంలో ఈ ఇద్దరు మహనీయులు చేసిన కృషిని వివరించారు. డా. బి.ఆర్. అంబేద్కర్ మిషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తరఫున, రిసోర్స్ సెంటర్‌లో కంప్యూటర్ & టైపింగ్ శిక్షణ



తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే, బాలురు, బాలికలకు పోటీ పరీక్షల కోసం కోచింగ్ తరగతులు ప్రతి ఆదివారం నిర్వహించి, అంబేద్కర్ వారసత్వాన్ని ప్రోత్సహించనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు అనంతరాజ్, రమేష్ కమల, లక్ష్మి, టి. మధుకర్, జి. నవీన్ కుమార్, బి. వినోద్, పురం కన్నయ్య, ఎస్. శివశంకర్, ఎస్. మల్లేష్, వై. మల్లేష్, డా. మురళి, ఎం. నరేందర్, డా. నవీన్ రాజ్, కె.ఎం. సురేష్, కె.జి. రవి, సి. సురేష్ (డిల్లీ), ఎల్. నరేందర్, కె.ఎస్. దీపక్, శ్రీనివాస్, చార్లిన్ రాజ్, మగేదర్, డా. ఉదయ్ కిరణ్, లయన్ విజయ్ కుమార్, డి. సురేష్, ఎల్. మహేందర్, భీమ్ రావు, మనోజ్, కె.ఆర్. శివలింగం, మరెన్నో మంది అంబేద్కర్ భావజాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కల నెరవేరుతుంది

- చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 12:**



అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో కైరా నరసింహ రేణుక దంపతులు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్ లు ముఖ్య అతిథిగా హాజరై గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా ఎన్నో కుటుంబాలు సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కన్ రెడ్డి మాలతి మాధవ్ రెడ్డి ,కౌన్సిలర్లు కైరా గణేష్ , నేమురి స్వప్న రామ్ ప్రసాద్ గౌడ్ , సామల జశ్వంత్ రెడ్డి , ముద్దం సుధాకర్ రెడ్డి , ఎ ఎం సి డైరెక్టర్ తుంకి భిక్షపతి , నాయకులు కైరా యాదగిరి, చిలుగురి మల్లేష్, నేమురి అర్జున్ , సత్యనారాయణ, గౌలిపల్లి నాగమల్ల రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# శ్మశాన వాటికలో నీటి సమస్యను పరిష్కరించిన కౌన్సిలర్ మౌనిక బాబు

- మౌలిక సదుపాయాలపై కౌన్సిలర్ మౌనిక బాబు ఫోకస్
- కౌన్సిలర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన స్థానికులు

**జయభేరి, శామీర్ పేట్, ఏప్రిల్ 12:**



అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాల్ గడి మలక్ పేట్ లో గల ఎస్సీ కాలనీ స్మశాన వాటిక వద్ద గత కొన్ని రోజులుగా బోరు పనిచేయకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . ముఖ్యంగా అంత్యక్రియల సమయంలో నీటి కొరత కారణంగా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. అయితే ఈ సమస్యపై 14వ వార్డ్ కౌన్సిలర్ మౌనికా బాబు దృష్టికి తీసుకువెళ్లగా వారు వెంటనే స్పందించి, పై అధికారులతో ఈ విషయంపై చర్చించారు.

అనంతరం అధికారుల సహకారంతో ఆదివారం బోరు మరమ్మతు పనులు పూర్తి చేసి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మౌనికా బాబు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడం తమ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాగా నీటి సమస్యను తక్షణమే పరిష్కరించిన కౌన్సిలర్ కు స్థానికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# స్కాలర్షిప్ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం కుట్రకు వ్యతిరేకంగా ఎబివిపి ఉద్యమం

- ఎబివిపి తెలంగాణ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్

**జయభేరి, దేవరకొండ :**




అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేవరకొండ నగర శాఖ ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబ ర్స్మెంట్ బకాయిలు రూ.10,000 కోట్లను వెంటనే విడుదల చేయాలని ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కో కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాల విద్యార్థుల విద్యకు బాసటగా నిలుస్తూ 14 లక్షల మంది విద్యార్థులకు అభయంగా నిలిచిన స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ఈ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకుండా ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్రను పన్నుతున్నట్లుగా బ్యాక్ డోర్ పాలిటిక్స్ ను చేస్తూ దిగజారుడు పాలనను చేస్తుందని విమర్శించారు. హైకోర్టు ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థుల నుండి ఫీజులను వసూలు చేసుకోవాలని ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పునః సమీక్షించాలని విద్యార్థులకు న్యాయం చేయాలని కోర్టులకు విన్నపిస్తున్నట్టుగా తెలిపారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయడంతో పాటు ఈ పథకం ఎత్తివేయాలని ఆలోచనలను సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మానుకోవాలని లేనిపక్షంలో ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ భారీ ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పగిళ్ల విక్రమ్, నగర సంయుక్త కార్యదర్శి యలమల హేమ సుందర్, గుండాల శివరామరాజు, రాకేష్, పండు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



తాటికొండ శ్రీలక్ష్మి ఎంపీసీ ద్వితీయ సంవత్సరం

## ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటిన 'స్ఫూర్తి' విద్యార్థులు


**జయభేరి, మేడ్చల్ :**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో మేడ్చల్ పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించి సత్తా చాటారు. మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఎం. డి. సమ్రీన్ 470 మార్కుల గాను 466 మార్కులు, మొదటి సంవత్సరం బైపిసి గ్రూపులో నైలా ఫాతిమా 440 మార్కులకు గాను 435 మార్కులు, సిఇసి మొదటి సంవత్సరం గ్రూపులో సాక్షి కుమారి 500 మార్కుల గాను 491 మార్కులు సాధించి మేడ్చల్ పట్టణంలో మొదటి స్థానాల్లో నిలిచారు. ద్వితీయ సంవత్సరం బైపిసి గ్రూపులో తనిషా పర్వీన్ 1000 మార్కులకు గాను 992 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో తాటికొండ శ్రీలక్ష్మి 1000 మార్కులకు గాను 981 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో మనీష్‌కుమార్ 1000 మార్కులకు గాను 981 మార్కులు, ద్వితీయ సంవత్సరం సీఈసీ గ్రూపులో కాజల్ 1000 మార్కులకు గాను 972 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల యాజమాన్య సభ్యులు శాలువాలతో సత్కరించి అభినందించారు. మేడ్చల్ పట్టణంలో ప్రతి సంవత్సరం ఉత్తమ ఫలితాలను సాధిస్తూ స్ఫూర్తి జూనియర్ కళాశాల ప్రతి సంవత్సరం ముందంజలో ఉంటుందని కళాశాల యాజమాన్య సభ్యులు తెలిపారు. కళాశాల అధ్యాపకులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య సభ్యులు మంజుల ప్రకాష్, కమలాకర్ రెడ్డి, దేవరాజ్, గణేష్, రామ్ శంకర్, సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సాక్షి కుమారి సిఇసి మొదటి సంవత్సరం

# సబ్‌స్క్రైబ్ పేరుతో అసభ్యకర కంటెంట్..



బుల్లితెరపై యాంకర్ గా మంచి పాపులారిటీ సంపాదించుకుంది విష్ణు ప్రియ. పోవే పోరా అనే షోతో స్మాల్ స్క్రీన్ పై ఫేమస్ అయిన ఈ అమ్మడు.. ఇటీవల బిగ్ బాస్ రియాల్టీ షోలోకి అడుగుపెట్టింది. ప్రస్తుతం పలు షోలలో యాంకర్ గా అలరిస్తున్న విష్ణు ప్రియ ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. ఆమె ఇన్ స్టాలో షేర్ చేసే ఫోటోస్ అసభ్యకరంగా ఉన్నాయని.. పైగా తన ఫోటోస్, అర్ధనగ్న వీడియో చూడాలంటే సబ్‌స్క్రైబ్ పేరుతో డబ్బులు చెల్లించాలని ప్రచారం చేసుకుంటున్నారని ఏఐఎస్‌ఎఫ్ విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేసి.. అనంతరం ఆమె ఇన్ స్టా బ్లాక్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.
ఈ మేరకు శనివారం రోజు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం సాయికుమార్, మరికొందరు విజయవాడ సూర్యారావు పేటలోని సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుల్లి తెరపై పలు షోలతో గుర్తింపు తెచ్చుకున్న ఒక యాంకర్ ఇలాంటి కంటెంట్ ప్రోత్సహించడం యువతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అన్నారు. సమాజంలో ఆదర్శంగా ఉండాల్సిన వ్యక్తులు డబ్బుల కోసం ఇలాంటి చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి కంటెంట్ వల్ల సమాజంలో నైతిక విలువలు దెబ్బతింటాయని అన్నారు. విష్ణుప్రియ ఇన్ స్టా ఖాతాను తక్షణమే నిలిపివేయాలని.. అలాగే ఆమె పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చాలా రోజులుగా సోషల్ మీడియాలో విష్ణుప్రియ చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం తన గ్లామరస్ ఫోటోస్ షేర్ చేస్తూ సందడి చేస్తుంటుంది. తాజాగా తనపై ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఇచ్చిన ఫిర్యాదుపై యాంకర్ విష్ణుప్రియ స్పందించాల్సి ఉంది.



## ఆమె గొంతులో ఏదో మ్యాజిక్ ఉందబ్బా!

దిగ్గజ గాయని ఆశా భోంస్లే (92) కన్నుమూశారు. ముంబైలోని బ్రీచ్‌క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం (ఏప్రిల్ 12) ఆమె తుది శ్వాస విడిచారు. పేరుకు హిందీ గాయని అయినా ఆమెకు అన్ని భాషల్లోనూ ప్రావీణ్యముంది.తెలుగులోనే కాకుండా హిందీ, తమిళం, బెంగాలీ వంటి 20కి పైగా భాషల్లో సుమారు 11,000కు పైగా పాటలు పాడి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారామె. కేవలం సినిమా పాటలే కాదు పాప్ మ్యూజిక్, గజల్స్, భజన పాటలతోపాటు భారత సాంప్రదాయ సంగీతం, జానపదాలు, ఖవ్వాలీ పాటలను పాడటంలోనూ ఆశాజీ సిద్ధహస్తురాలుసుమారు 8 దశాబ్దాల ఆమె సంగీత ప్రస్థానంలో తెలుగు సినిమాతో ఉన్న అనుబంధం చాలా తక్కువే అయినా, ఆమె పాడిన 8 పాటలు తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేశాయి. ఎవర్ గ్రీన్ క్లాసిక్స్‌గా నిలిచాయి.
1981లో ‘పాలు నీళ్లు’ అనే సినిమాలో ‘ఇది మౌనగీతం’ అనే పాటను ఆలపించారు ఆశాజీ. ఇది ఆమె పాడిన మొదటి తెలుగు సాంగ్. ఆ తర్వాత 1988లో ‘చిన్ని కృష్ణుడు’ చిత్రంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో కలిసి ‘జీవితం సప్త సాగరం’ అనే గీతాన్ని పాడారు. దీనికి ఆమె భర్త ఆర్డీ బర్మన్ సంగీతం సమకూర్చడం విశేషం. 1992లో బాలకృష్ణ హీరోగా నటించిన ‘అశ్వమేధం’ సినిమాలో ఆశా భోంస్లే రెండు పాటలు ఆలపించారు. ఇళయరాజా స్వరకల్పనలో ఆమె పాడిన ‘ఓ ప్రేమా’, ‘సీతాకాలం ప్రేమకు’ పాటలు ఎవర్ గ్రీన్ సాంగ్స్ అనిపించుకున్నాయి. ఈ సాంగ్స్ ఇప్పటికీ ఎక్కడో ఓ చోట వినిపిస్తూనే ఉంటాయి. ఇక 1995లో ‘ప్రేమకు ప్రేమంటే తెలుసా’ సినిమాలో ‘జల్లంది మది’ అనే పాట పాడారు ఆశా భోంస్లే. అలాగే 1996లో ఎంఎం కీరవాణి ‘పవిత్ర బంధం’ సినిమాలో ‘ఐసాలకిడీ’ అనే సాంగ్ ను ఆశాజీతో పాడించారు. వెంకటేష్, సౌందర్య హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో.. ఆశా భోంస్లేతో స్టేజ్ మీద ఈ సాంగ్ పాడించినట్లు చూపిస్తారు. ఇక మణిరత్నం’ఇద్దరు’ సినిమాలో ‘వెన్నెల వెన్నెల’ పాటను ఎంతో అద్భుతంగా ఆలపించారు ఆశాజీ. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ స్వరాలు అందించారు. ఇక ఈ సాంగ్ తర్వాత చాలా ఏళ్లకు 2007లో కృష్ణవంశీ దర్శకత్వం వహించిన ‘చందమామ’ చిత్రంలో ‘నాలో ఊహలకు’ పాట పాడి తెలుగు సంగీత ప్రియులను ఆకట్టుకున్నారు ఆశాజీ. ఈ సాంగ్ కు కెఎం రాధాకృష్ణన్ సంగీతం సమకూర్చారు. ఆశాజీ తెలుగులో పాడిన చివరి సాంగ్ ఇదే. మొత్తంగా తెలుగులో 8 పాటలు ఆలపించి ఇక్కడి ఆడియెన్స్ మనసులు గెల్చుకున్నారు ఆశా భోంస్లే.

## హ్యాట్రిక్ హిట్స్ తర్వాత బ్రేక్..



ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి, దర్శకుడిగా-హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ప్రస్తుతం తన కెరీర్‌లో కీలక దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. వరుసగా బ్లాక్‌బస్టర్ హిట్స్ అందుకున్న ఆయనకు, తాజా చిత్రం ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ ఊహించని షాక్ ఇచ్చినట్లుగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ సినిమాను దర్శకుడు విఘ్నేష్ శివన్ తెరకెక్కించగా, హీరోయిన్‌గా కృతిశెట్టి నటించారు. ఈ చిత్రాన్ని నయనతార నిర్మించారు. పలు వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న విడుదలైన ఈ ఫ్యూచరిస్టిక్ లవ్ స్టోరీకి ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. కాన్సెప్ట్ కొత్తగా ఉన్నప్పటికీ, కథనాన్ని ఆసక్తికరంగా నడిపించలేకపోయారని విమర్శలు వస్తున్నాయి. ప్రదీప్ తన పాత్రలో బాగా నటించినా, మిగతా అంశాలు సినిమాను నిలబెట్టలేకపోయాయని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ‘లవ్ టుడే’ కేవలం రూ.5 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి రూ.100 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం విశేషం. అనంతరం వచ్చిన సినిమాలు కూడా భారీ విజయాలు సాధించడంతో, హ్యాట్రిక్ ₹ 100 కోట్ల గ్రాస్ అందుకున్న హీరోగా అరుదైన రికార్డు సృష్టించాడు.‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ మొదటి రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.22 కోట్ల గ్రాస్ రాబట్టినట్లు సమాచారం. అయితే మిక్స్‌డ్ టాక్ కారణంగా ఫస్ట్ వీకెండ్ తర్వాత కలెక్షన్లు పడిపోయే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రదీప్ రంగనాథన్ కెరీర్ ప్రారంభం నుంచే విజయవంతంగా సాగింది.కోమాలితో దర్శకుడిగా పరిచయం, లవ్ టుడేతో హీరోగా సెన్సేషన్, తరువాత వచ్చిన చిత్రాలు కూడా భారీ వసూళ్లు సాధించాయి. తెలుగులో ఈ సినిమా పెద్దగా చర్చకు రాకపోవడం గమనార్హం. ఇప్పటివరకు వరుస విజయాలతో దూసుకెళ్లిన ప్రదీప్ రంగనాథన్‌కు ఇది మొదటి పెద్ద పరీక్షగా మారింది. ఈ సినిమా ఫైనల్‌గా ఎలాంటి కలెక్షన్లు సాధిస్తుందో, అలాగే ఆయన తదుపరి ప్రాజెక్ట్ తో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి వస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

## నాపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవం!.. పోలీసులకు మంగ్లీ ఫిర్యాదు




### డబ్బులు ఇవ్వలేదనే సుబ్బారావు తప్పుడు కథనాలు

న్యాయవాది సుబ్బారావు తనపై చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని, కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని సింగర్ మంగ్లీ ఆరోపించారు. మైక్రోఫైనాన్స్ పేరుతో మంగ్లీ, ఆమె సోదరుడు, అతడి స్నేహితులు తన క్లయింట్ల ను కోట్లాది రూపాయలు మోసం చేశారని న్యాయవాది సుబ్బారావు పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై వ స్తున్న ఆరోపణలను ఖండిస్తూ మంగ్లీ ఆదివారం పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తాను రూ.150కోట్ల మోసానికి పా ల్పడినట్టు న్యాయవాది సుబ్బారావు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తనతో దు రుసుగా మాట్లాడటమే కాకుండా డబ్బు లు డిమాండ్ చేశారని, అవి ఇవ్వనందుకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. తనకు సంబంధం లేని కరెన్సీనోట్ల వీడియోలను వైరల్ చేస్తూ తనను మానసిక వేదనకు గురిచేస్తున్నాడని వాపోయారు. 14 ఏండ్ల నుంచి ఒక్కో మెట్టు ఎక్కుతూ ముందుకు సాగుతున్నానని, ఒక బంజా రా ఆడబిడ్డనైన తనను కావాలనే బద్‌నాం చేస్తున్నారని అన్నారు. తన పేరు చెప్పుకొని ఎవరో వసూలు చేస్తే దానికి తాను ఏమీ చేయాలని, తనకు ఎలా తెలుస్తుందని, తానేమైనా రోబోనా..? అని ప్రశ్నించారు.
నిత్యం ప్రోగ్రామ్‌లతో బిజీగా ఉండటం వల్ల బయటకు రాలేకపోయానని పేర్కొన్నారు. తన పేరును వాడుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కోకాపేటలో స్కూల్, పబ్ ఎక్కడుందో తనకు తెలియదని, ఆ బిజినెస్ మైండ్ తనకు లేదని తెలిపారు.
బాలాజీ నాయక్, మధునాయక్ దందా చాలా రోజుల నుంచి నడుస్తున్నదని, ప్రస్తుతం ఆ కేసు సీఐడీ పరిధిలో ఉన్నదని పేర్కొన్నారు. ఈ విషయంలో నష్టపోయిన బాధితులకు తాను అండగా నిలబడుతానని స్పష్టంచేశారు. సినిమాల మీద మక్కువతో తన పేరును సుబ్బారావు వాడుకోవాలని చూస్తున్నాడని, మీడియాకు తప్పుడు సమాచారం ఇస్తున్నాడని తెలిపారు. తాను ఈ కేసులో ఉన్నట్టు నిర్ధారణ అయితే ఎక్కడికి రావడానికైనా సిద్ధమని స్పష్టంచేశారు.

## క్రిస్టల్ డిసౌజా డైట్ రొటీన్

క్రిస్టల్ తన ఆహారపు అలవాట్ల గురించి మాట్లాడుతూ.. “నేను బ్రేక్‌ఫాస్ట్ అస్సలు తినను. నేరుగా లంచ్ మాత్రమే చేస్తాను, అది కూడా చాలా హెవీగా ఉంటుంది. ఇంట్లో ఉంటే ఆకు కూరలు, ఒక రోటీ, కొంచెం పెరుగు తీసుకుంటాను. ఒకవేళ బయట ఉంటే మాత్రం సలాడ్ తింటాను” అని తెలిపారు. అయితే ఆమె డిన్నర్ మాత్రం చాలా రాయల్‌గా ఉంటుందట. ప్రతిరోజూ రాత్రి బయట జపనీస్ లేదా ఏషియన్ ఫుడ్ తింటానని, ఆ తర్వాత మళ్ళీ 15 గంటల పాటు ఏమీ తినకుండా ఉంటానని ఆమె వివరించారు. ఈ పద్ధతినే చాలామంది ‘ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్’ అని కూడా పిలుస్తుంటారు. ఈ రకమైన డైట్ పద్ధతి అందరికీ మేలు చేస్తుందా? అన్న ప్రశ్నపై నిపుణులు ఏమంటున్నారంటే.. “నిర్మాణాత్మకమైన ఉపవాసం కొంతమందికి వారి జీవనశైలికి అనుగుణంగా పని చేయవచ్చు. 12 నుండి 15 గంటల పాటు ఆహారం తీసుకోకుండా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థకు తగిన విశ్రాంతి దొరుకుతుంది. ఇది కొన్ని సందర్భాల్లో మెటబాలిజంను మెరుగుపరచడానికి తోడ్పడుతుంది”. అయితే ఇది ప్రతి ఒక్కరికీ సరిపోదని ఆమె హెచ్చరించారు. ముఖ్యంగా కష్టపడి పనిచేసేవారు లేదా క్రీడాకారులకు ఈ పద్ధతి వల్ల శక్తి తగ్గిపోయే ప్రమాదం ఉంది. రక్తంలో చక్కెర స్థాయిలలో మార్పులు ఉన్నవారు లేదా విపరీతమైన శారీరక శ్రమ చేసేవారు ఎక్కువ సేపు ఆకలితో ఉంటే నీరసం రావడం లేదా తలనొప్పి వంటి సమస్యలు ఎదుర్కోవచ్చు. ఆహారం ఎప్పుడు తింటున్నాం అనే దానికంటే, ఆ తిన్న తర్వాత మన శరీరం ఎలా స్పందిస్తోంది అనేది ముఖ్యమని డాక్టర్ షేక్ వివరించారు. క్రిస్టల్ డిసౌజా వంటి సెలబ్రిటీలు అనుసరించే డైట్ ప్లాన్ వారి పని ఒత్తిడికి, వారి శరీరతత్వానికి సరిపోవచ్చు. కానీ సామాన్యులు ఇటువంటి పద్ధతులను పాటించే ముందు తమ ఆరోగ్య పరిస్థితిని బట్టి నిపుణుల సలహా తీసుకోవడం ఉత్తమం. ఆరోగ్యకరమైన ఆహారం మరియు సరైన వ్యాయామం కలిస్తేనే సంపూర్ణ ఫిట్‌నెస్ సాధ్యమవుతుంది.




Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**